విశాలాంధ్ర
శ్రీకాకుళం
శనివారం 17, మే 2025



నైటింగేల్ అవార్డు గ్రహీతకు అభినందనలు

విశాలాంధ్ర-టెక్కలి : మండలంలోని స్థానిక అయ్యప్పనగర్‌లో ఉంటున్న నెయ్యిల చిన్నమ్మి బుడితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెడ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె సేవలను గుర్తించి విజయవాడకు చెందిన హెల్త్ కేర్ ట్రస్ట్ మాసపత్రిక యాజమాన్యం ప్రెస్ క్లబ్ వారు చిన్నమ్మి కు ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు కోరాడ రాంప్రసాద్ చిన్నమ్మికి అభినందనలు తెలిపారు. ఇలాంటి అరుదైన అవార్డు మన ప్రాంతానికి రావటం ఇదే మొదటిసారి అని అన్నారు. మా మిత్రుడు చిన్నమ్మి భర్త నెయ్యిల అప్పారావు డ్రైవు మాస్టర్ గా అందరికి సుపరిచితులు వీరి స్వస్థలం తిర్లంగి గ్రామం కావటం వలన తిర్లంగి సీనియర్ టిపిడి నాయకులు దవల రామచంద్రుడు, దవల రాజశేఖర్ పిట్ట జానికి రామయ్య జలుమూరు వెంకటి తదితరులు కుటుంబ సభ్యులు నెయ్యిల నీలకంటు నెయ్యిల ప్రదీప్ నెయ్యిల శివ తదితరులు చిన్నమ్మికి అభినందనలు తెలియజేశారు.

సభ్యుల ఆర్థిక అభివృద్ధే 'ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్' లక్ష్యం

- తక్కువ వడ్డీ రుణాలతో సామాన్యులకు ఆర్థిక భరోసా
- 2030 నాటికి 100 బ్రాంచ్ ల లక్ష్యం
- శ్రీకాకుళం ది విశాఖపట్నం కోఆపరేటీవ్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచాళ్ల రామకృష్ణారావు, పలాస ఇంచార్జ్ డైరెక్టర్ కె.ప్రసాదరావులు వెల్లడి

విశాలాంధ్ర-శ్రీకాకుళం : 110 ఏళ్లుగా అంచలంచెలుగా ఎదిగి నేడు రూ.7791 కోట్ల లావాదేవీలతో నడుస్తున్న దది విశాఖపట్నం కోఆపరేటీవ్ బ్యాంక్ సభ్యుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచాళ్ల రామకృష్ణా రావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్వీడీ కన్వెన్షన్ లో బ్యాంక్ డైరెక్టర్ కండాపు ప్రసాద రావు అధ్యక్షత శ్రీకాకుళం బ్రాంచ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ సామాన్యులకు, చిన్న చిన్న, వ్యాపారులకు తక్కువ వడ్డీ తో కూడిన రుణాలు ఇచ్చి వారి ఆర్థిక భరోసా కు పాటుపడుతుందన్నారు. దేశంలోని మొత్తం 1472 కోఆపరేటివ్ బ్యాంక్‌లలో 15వ స్థానంలో ఉందన్నారు. లాభాపేక్ష లేకుండా సామాన్యులకు బ్యాంకింగ్ మరింత దగ్గర చేయాలని ఉద్దేశంతో నిరంతరం మన బ్యాంకు పనిచేస్తుందన్నారు. 1,11,593 మంది సభ్యులతో 55బ్రాంచ్‌లలో సేవలు అందిస్తుందని, 2030నాటికి 100 బ్రాంచ్‌ల లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. సభ్యులు మరణిస్తే వారి కుటుంబాలకు ప్రమాద భీమా అందించడం తో పాటు, సభ్యుల పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ నగదు పురస్కారంతో పాటు, తక్కువ వడ్డీ కి విద్యా రుణాలు అందిస్తున్నాం అన్నారు. ప్రతీ సభ్యుడికి జవాబు చెప్పేలా ప్రతీ ఏటా ఇలాంటి సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేసి మన బ్యాంక్ లావాదేవీలు మొత్తం ఒక పుస్తక రూపం లో ప్రతీ సభ్యుని ముందు ఉంచుతున్న ఒకే ఒక బ్యాంక్ మనదే అన్నారు. మన బ్యాంక్ మరింత అభివృద్ధికి ప్రతీ సభ్యుడు కృషి చెయ్యాలని కోరారు. డిప్యూటీ సీఈఓ ఎం. వి గణేష్ కుమార్ 24 - 25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లావాదేవీలు, బ్యాంక్ పురోగతిని సభ్యులకు వివరించారు. ఈకార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్ పీవీ నరసింహామూర్తి, బ్యాంక్ జోనల్ మేనేజర్ జె. శ్రీనివాసరావు, శ్రీకాకుళం బ్రాంచ్ మేనేజర్ ఎం. రాజకుమారి, శ్రీకాకుళం బ్రాంచ్ ప్రతినిధి కొత్తకోట శ్రీనివాసరావు, పలువురు సభ్యులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలాస : దేశంలోనే అతిపెద్ద సహకార బ్యాంకుగా ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ నిలిచిందని, 1421 నాన్ షెడ్యూల్ బ్యాంక్ లలో ప్రథమ స్థానంలో ఉందని ఇంచార్జ్ డైరెక్టర్ ప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఎంసి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పలాస బ్రాంచ్ సభ్యుల మహాజన సభలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార వ్యవస్థలో ది విసిబి బ్యాంక్‌కు ప్రత్యేకమైన గుర్తింపు లభించిందని, అంతర్జాతీయ సంస్థగా ఐక్యరాజ్యసమితి గుర్తించి ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు పాల్గొనాలని ఆహ్వానం వచ్చిందని, ఆయన సలహాలు సూచనలు తీసుకున్నారని గుర్తు చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న 523 బ్యాంకుల్లో కేవలం 10బ్యాంకులను గుర్తించి ఆహ్వానించారని అందులో ఈవిశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ ఉండడం గర్వ కారణమన్నారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆర్.బి.ఐ స్టాండింగ్ అడ్వైజరీ కమిటీ వేసిందని అందులో ది విసిబి బ్యాంక్ పాల్గొన్నదని తెలిపారు. బ్యాంకుకు ఖాతాదారులే పునాదులని పలాస బ్రాంచ్లో 21 కోట్ల రూపాయల రుణాలు ఖాతాదారులకు అందజేశామని సక్రమంగా వాయిదాలు చెల్లించాలని కోరారు. డిప్యూటీ సీఈవో గణేష్ మాట్లాడుతూ 2024 నాటికి 50 బ్రాంచీలలో 4148.3కోట్ల రూపాయల వ్యాపారం జరిగిందని 26 కోట్ల రూపాయలు ఆదాయం రావడంతో 4354 రూపాయల కోట్ల రూపాయలకు చేరుకుందన్నారు. అందులో రుణాల రూపంగా 3,191.24 రూపాయలు అందజేయమన్నారు. దేశంలో 1472 కోపరేటివ్ బ్యాంకులో ఉంటే అందులో ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ 35వ స్థానంలో, అన్ని బ్యాంకుల్లో టాప్ 50లో కూడా ఉందన్నారు. ప్రస్తుతం 55 బ్యాంకులలో ది విసిబి బ్యాంక్ కార్యకలాపాలు నిర్వహిస్తుంటే మరో ఐదు బ్రాంచీలు పీలా నగర్, చిత్తూరు, బాపట్ల, తాడేపల్లిగూడెం నెలలో నూతన బ్రాంచ్ లను త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో నూజివీడు, తెనాలి, అమలాపురం, హైదరాబాద్, విశాఖలో మరో బ్రాంచ్ ప్రారంభించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. 110ఏళ్ల చరిత్రగల బ్యాంకులో ఖాతాదారులకు అనేక సంక్షేమ పథకాలను దేశంలో ఏ బ్యాంక్ అమలు చేయని విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 26 కోట్ల రూపాయల పైబడి ప్రభుత్వానికి ఆదాయం పన్ను చెల్లించే బ్యాంకు ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ ఒకటేనని గుర్తు చేశారు. బ్యాంక్ డైరెక్టర్ నరసింహామూర్తి మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద సహకార బ్యాంకుగా ది విసిబి బ్యాంకు నమోదు అయిందని, నాన్ షెడ్యూల్డ్ బ్యాంకులలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. సహకార వ్యవస్థలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. సహకారం అంటే సమిష్టిగా ఉండడమేనని, సభ్యుల సంక్షేమ పథకాల అమలుచేయడంలో బ్యాంకు ముందంజలో ఉందన్నారు. సహకార సంస్థల అభివృద్ధి చెందాలంటే అందరూ సహకారం అవసరమన్నారు. డైరెక్టర్ రామకృష్ణారావు మాట్లాడుతూ దీ విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా మనుగడ సాగిస్తుందని 2007లో 10 బ్రాంచీలలో సేవలు అందించేదని ప్రస్తుతం 55 బ్రాంచీలలో ఒక లక్ష 11 వేల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. బ్యాంకులో 4,500 కోట్ల రూపాయలు పెట్టుబడులు ఉండగా 3,500 కోట్ల రూపాయలను రుణాలు అందజేశామని తెలిపారు. కోఆపరేటివ్ బ్యాంకులే దేశ దిశ దశలను మార్చగలరని అన్నారు. ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంకుకు 40 సంవత్సరాలుగా పాలకవర్గంలో ఎన్నికలు లేవని, ఏకగ్రీవంగానే సభ్యులు పాలకవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. జోనల్ మేనేజర్ శ్రీనివాసరావు వందన చేశారు. అనంతరం బ్యాంకు నుండి రుణాలు తీసుకుని క్రమం తప్పకుండా తీర్చిన లండ పాపారావు, వైశ్యరాజు రూపవతిలను పాలకవర్గం ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో పలాస బ్రాంచ్ మేనేజర్ జి.ఎల్.వి. ప్రకాషరావుతోపాటు బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

చలమయ్యపేట జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు : ఇద్దరు మృతి

విశాలాంధ్ర- సంతబొమ్మాళి /కోటబొమ్మాళి : కోటబొమ్మాళి మండలం చలమయ్యపేట జాతీయ రహదారి పై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. చలమయ్యపేట గ్రామానికి చెందిన చెల్లూరు మల్లేశు, అంగ అప్పన్న జాతీయ రహదారి నుంచి కోటబొమ్మాళి నుంచి స్వగ్రామానికి వెళుతున్న సందర్భంలో శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు వెళుతున్న కారు ఢీ కొట్టింది. దీంతో సుమారు 12 మీటర్లు దూరంలో ఉన్న పొలంలోకి ద్విచక్ర వాహనం ఎగిసి పడింది. బలమైన గాయాలు తగలడంతో టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి 108లో వాహనంలో తరలించారు. చికిత్స పొందుతుండగా చెల్లూరు మల్లేష్ గురువారం రాత్రి మృతిచెందారు. అంగ అప్పన్న కు ప్రాణాపాయ స్థితిలో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించగా, ఫలితం లేకపోవడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు తరలించారు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మృతులకు భార్య పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోటబొమ్మాళి ఎస్సై వి సత్యనారాయణ తెలిపారు.

దివ్యాంగులను అన్నివిధాలుగా ఆదుకుంటాం : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఉపాధి అవకాశాలు కావలసిన వారికి స్థానికంగా కల్పిస్తామని, దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి అన్ని విధాలుగా ఆదుకుంటాం అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్వాభిమాన్ దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ లో ఆయనతో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మూడవ శుక్రవారం స్వాభిమాన్ దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ జరుగుతోందన్నారు. ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ లో లైన్ లలో నిలుచోవడం ఇబ్బందిగా ఉంటుందని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతీ మూడవ శుక్రవారం గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించే స్వాభిమాన్ కు 12 అర్జీలు వచ్చినట్లు వివరించారు. వచ్చిన 12 అర్జీలలో పెన్షన్లు, ఉపాధి అవకాశాలు కల్పించాలని పెట్టుకున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ మెంట్, జాబ్ మేళా ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. డెఫ్ అండ్ డం వారికి స్థానికంగా సూపర్ మార్కెట్, షాపింగ్ మాల్స్, తదితర వాటిలో ఉపాధి అవకాశాలు కల్పించినట్లు వివరించారు. పెన్షన్ అర్జీలు డిఆర్డిఎ పిడికి పంపించి తగు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వీల్ చైర్ కావాలని ఒక అర్జీ వస్తే తక్షణమే వీల్ అంద జేసినట్లు తెలిపారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పౌర విమానయాన శాఖ, తదితర వాటి ద్వారా సియస్ ఆర్ నిదులుతో ఈ నెల లేదా వచ్చే నెలలో ఒక పెద్ద ప్రోగ్రాం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీల్ చైర్లు, మొబైల్ ఫోన్లు, వినికిడి యంత్రాలు, తదితరమైనవి ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే ఎడి డిజేబిల్‌కు అందజేయాలన్నారు. అర్జీలు స్వీకరణలో జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి.శ్రీధర్‌రాజ, తదితరులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ అనిత, జిల్లా ఎంప్లాయ్ మెంట్ అధికారి సుధా, బిసి కార్పొరేషన్ అధికారి గడ్డెమ్మ, విభిన్న ప్రతిభా వంతులు శాఖ ఎడి కె. కవిత, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యువకునికి రూ.6600 ఆర్థిక సహకారం

విశాలాంధ్ర-మెలియాపుట్టి : తన పనిలో తాను నిమగ్నమై ఎప్పటిలానే తన పనికి వెళ్లి పని చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పైనుండి పడిపోవడంతో గాయాలపాలై శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్న ఆ యువకునికి మారుమూల గిరిజన గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి ధైర్యాన్ని చెప్పి తమకు తోచినంతగా తలవకింత నగదు జమ చేసుకొని 6600 రూపాయలను తన తల్లి ద్వారా యువకునికి అందజేసిన సంఘటన మెలియాపుట్టి మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే పరుశురాంపురం పంచాయితీలో తొవూరు గ్రామానికి చెందిన సవర రమేష్ అనే వ్యక్తి సెంటెరింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు అయితే ఇటీవల కాలంలో పనిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కర్రల పైనుండి పడిపోవటంతో గాయాల పాలయ్యాడు. మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆ గ్రామ సర్పంచ్ ప్రసాద్ తోపాటు మరికొంత మంది యువకులు కలిసి శుక్రవారం నాడు హాస్పటల్ కి సందర్శించి, గాయాల పాలైన రమేష్ ను పరామర్శించి, ప్రమాదం ఎలా జరిగింది తదితర వివరాలను తెలుసుకొని ధైర్యాన్ని చెప్పడంతో పాటు 6600 నగదును సైతం యువకునికి అందజేశారు. ఆసుపత్రికి సందర్శించిన వారిలో పరశురాంపురం సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, ఎస్. కళ్యాణ్, ఎస్. విశ్వనాథ్, ఎస్. విజయ్ తదితర యువకులున్నారు

ఫోటో: ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం: 16ఎస్‌కెఎల్ఎం05

ఘనంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పలాస : ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న గారి ఆశయసాధనే ధ్యేయంగా తండ్రి గౌతు శ్యామ సుందర శివాజీ గారి అడుగుజాడల్లో నడుస్తూ సిక్కోలు శివంగి గా పేరు తెచ్చుకున్న పలాస ఎమ్మెల్యే గౌత శిరీష జన్మదిన వేడుకలను శుక్రవారం టిడిపి కార్యాలయంలో కార్యకర్తలు అభిమానులు ఘనంగా నిర్వహించారు. టిడిపి కార్యకర్తలు కేకును కట్ చేసి శిరీష కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, సీనియర్ టిడిపి నాయకుడు లోడగల కామేశ్వరరావు యాదవ్, మల్ల శ్రీనివాసరావు, విటల్, గంగాభవాని, గురుటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, దడియాల నరసింహులు, బడ్డ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే మందస మండలం టిడిపి కార్యకర్తలు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం హరిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు మరియు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి దాసరి తాతారావు, మండల అధ్యక్షులు భావన దుర్యోధన, మాజీ సర్పంచ్ డొంకురు తిరుపతి లతోపాటు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య కేసులో త్రిసభ్య కమిటీ ఏమైనట్టు?

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : కంచిలి మండలం పెద్దకొజ్జిరియా గ్రామంలో గత నెల 9న బల్లెడ నర్సింహమూర్తి అనే రైతు అప్పుల బాధలతో ఆత్మహత్యకు గురవ్వగా దానిపై డివిజనల్ స్థాయిలో గల త్రిసభ్య కమిటీ ఏమైందని ఇంత వరకు బాధిత కుటుంబాన్ని కలిసిఎందుకు విచారణ జరపలేదని వాస్తవాలను ఎందుకు ప్రభుత్వానికి నివేదించలేదని జిల్లా మానవహక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల కన్వీనర్ వి.ఎస్.కృష్ణ, రాష్ట్ర కన్వీనర్ కె.ఎస్.జగన్నాధరావు, ప్రతినిధి అనూరాధ, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి బాలు తదితరులు ప్రశ్నించారు. ప్రాథమికంగా పోలీసులు జరిపిన విచారణ మేరకు ఎఫ్ఐఆర్‌లోను అప్పుల ఒత్తిడిని తట్టుకోలేక నర్సింహమూర్తి బలవన్మరణానికి గురైనట్లు స్పష్టంగా పేర్కొన్నప్పటికీ త్రిసభ్య కమిటీలో ఆర్‌డిఓ, డిఎస్పీ, ఎగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ నెల రోజులు దాటినా కుటుంబ సభ్యులను ఎందుకు కలవలేదని, వాస్తవాలపై ఎందుకు విచారణ చేయలేదని విలేకర్ల సమావేశంలో నిలదీశారు. ఈ మేరకు బీసీ సంఘాల రాష్ట్ర కార్యదర్శి బీన ఢిల్లీరావుతో కలిసి శుక్రవారం పెద్దకొజ్జిరియా గ్రామంలో మృతుడు నర్సింహమూర్తి కుటుంబాన్ని కలిసి విషయాలను అడిగి తెలుసుకున్నారు. 2020లో రూపొందించిన జీఓ 43 ప్రాప్తికి ఇటువంటి ఘటనలో ప్రభుత్వం వారం రోజుల్లోగా 7లక్షల రూపాయల పరిహారాన్ని బాధిత కుటుంబానికి చెల్లించాల్సి ఉండగా 36 రోజులు గడచినా ప్రభుత్వం మౌనం దాల్చడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. బాధ్యత గల అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఇప్పటికైనా బాధిత కుటుంబాన్ని కలిసి వాస్తవాలను జిల్లా కలెక్టర్‌కు నివేదించి తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను పంపించి పరిహారం సత్వరం అందేలా చూడాలని కోరారు. ఈ విషయంలో అలక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయిలో పోలీసులు వాస్తవాలకు దగ్గరగా ఎఫ్ఐఆర్ తయారు చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఈబృందం మకరాంపురం గ్రామంలో సర్పంచ్ తమరాల శోభన్‌బాబును కలిసి ఉద్దానంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభాన్ని గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన పంటలు ఎదుర్కొంటున్న తెగుళ్లు, తెల్లదోమ మొదలైన కారణాల రీత్యా దిగుబడులు విపరీతంగా తగ్గిపోయి రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని వివరించారు. అనంతరం కంచిలిలో మీడియాతో ఈ బృందం మాట్లాడింది.

వడదెబ్బకు గురై కానిస్టేబుల్ అస్వస్థత

హెచ్‌సిను పరామర్శించిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-పలాస : కాశీబుగ్గ పోలీసు స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ యుగంధర్ విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం బందోబస్తు విధుల్లో ఉండగా ఉష్ణోగ్రత తీవ్రత (ఎండ తీవ్రత) కారణంగా వడదెబ్బకు అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయాన్ని గమనించిన తోటి సిబ్బంది వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఈ క్రమంలో శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్లో పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి విషయాన్ని తెలుసుకుని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని హెడ్ కానిస్టేబుల్ యుగంధర్ ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య అధికారులను సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యుగంధర్ తో మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వేడిని తట్టుకునేందుకు మంచి నీరు, ఓ ఆర్.ఏస్, పళ్ళరసాలు వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, క్యాప్, కళ్ళకు కూలింగ్ కళ్లద్దాలు ధరించాలని, వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్త చర్యలు పాటించాలని జిల్లా ఎస్పీ సూచించారు. వయస్సు ప్రాతిపదికన సిబ్బందికి విధుల్లో కొంత వెసులుబాటు కల్పించాలని సీఐ వి సూర్యనారాయణకు సూచించారు.

వ్యవసాయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

- సబ్సిడీపై రైతులకు యాంత్రీకరణ పరికరాలు, వాహనాల పంపిణీ
- కార్యక్రమంలో ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్

విశాలాంధ్ర-ఆమదాలవలస : వ్యవసాయ రంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలో కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై యాంత్రీకరణ పరి కరాలు, వాహనాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక పరిజ్ఞా నంతో వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందు కు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతుంద న్నారు. గత వైకాపా ప్రభుత్వ పరిపాలనలో వ్యవసా యాన్ని పూర్తిగా నాశనం చేశారని విమర్శించారు. రైతులకు సబ్సిడీపై పరికరాలు అందించకపోవడంతో వ్యవసాయరంగం అట్టడుగు స్థాయికి చేరుకుందన్నా రు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసా య పరికరాలు, రోటోవేటర్, బ్యాటరీ ఆపరేటెడ్ స్ప్రెయర్, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్, దుక్కు నాగలి సెట్స్, వరి నూర్పు యంత్రం, కలుపు తీసే యంత్రం (పవర్ వీడర్) వంటి పరికరాలను సబ్సిడీపై అంద జేస్తుందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని లాభసా టిగా మార్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలియజేశారు. వ్యవసాయంలో నూత న పద్ధతులను అవలంబించి ఎక్కువ దిగుబడులు సాధించేలా రైతులు సాగు చేయాలన్నారు. రైతులకు ఎటువంటి వ్యవసాయ పరికరాలు అవసరం ఉన్న గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో తమ దరఖాస్తు అంద జేయాలని సూచించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతే రాజుగా మార్చేందుకు కృషి చేస్తున్న ట్టు తెలియజేశారు. రైతులందరికీ త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వ్యవసాయానికి పెట్టుబడి నిధులను కేటాయించడం జరుగుతుంది అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పో రేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్, డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్య నారాయణ, టిడిపి జిల్లా కార్యదర్శి మొదలవలస రమేష్, పట్టణ అధ్యక్షులు సంపదరావు మురళీధర్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు నందివాడ గోవిందరావు, వ్యవసాయ శాఖ జెడి త్రినాధ స్వామి, ఏ డి ఏ బగ్గు రజిని, మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహన రావు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి చైర్మెన్ కూన రవికుమార్

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణం నుండి ఆమదాలవలస నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో అద్భుతమైన రోడ్ల నిర్మాణం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పి యు సి చైర్మెన్ కూన రవికుమార్ తెలియపరిచారు. రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. సరుబుజ్జిలి మండలం కొత్తకోట జంక్షన్‌లో ఏబి రోడ్డు నుంచి కొత్తకోట గ్రామానికి సిసి రోడ్డు, ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి రూ.1.47 కోట్లతో నిర్మించనున్న పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏబి రోడ్డు నుంచి నక్కల పేట గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ. 62 లక్షలతో నిర్మించిన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు సత్వరమే పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. రహదారులు లేని గ్రామాలకు విడతల వారీగా ప్రభుత్వ నిధులు వెచ్చించి రహదారి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకు వస్తామని చెప్పారు. నియోజకవర్గంలో రహదారి లేని గ్రామం, సిసి రోడ్డు లేని వీధి రానున్న రోజుల్లో లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా డి సి సి బి చైర్మన్ శివాల సూర్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షులు అంబళ్ల రాంబాబు, మండల అధికారులు కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గున్నారు.

తాగునీటి సమస్యను తీర్చండి

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం కొర్లాం గ్రామ పంచాయతీలో ప్రస్తుత వేసవిలో నెలకొన్న త్రాగునీటి ఎద్దడిని అధికారులు పరిష్కరించాలని సర్పంచ్ రాంబుడ్డి రవణమ్మ పేర్కొన్నారు. హుకుంపేట, బ్రాహ్మణ కొర్లాం, గొనకపాడు, లక్ష్మీపురం, నూకలూరు గ్రామాలకు జలజీవన్ పథకం ద్వారా మంచినీరు రాకపోవడంతో గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రామాల్లో బోరుబావుల్లో నీరు అడుగంటిందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో బ్రాహ్మణకొర్లాంలో సంబర మహోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు వెంటనే చర్యలు తీసుకుని త్రాగునీరు అందించాలని కోరారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ పురపాలక సంఘానికి సంబంధించి, "మన ఇల్లు మన గౌరవం" ఎన్టీఆర్ హౌసింగ్ కార్యక్రమంలో భాగంగా అర్బన్ గృహనిర్మాణ లబ్ధిదారులందరూ తక్షణమే ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు లబ్ధిదారులను కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులందరితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అడిషనల్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్‌గా ఇచ్చిన ఆర్థిక సహాయంతో తక్షణమే ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని, అదేరకంగా స్టేజ్ అప్డేషన్లను కూడా కొనసాగించాలని కోరారు. ఈ నెలాఖరు లోపు అన్ని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని, లేని పక్షంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏఎఫ్ఏ రికవరీ మరియు మంజూరు చేసిన ఇళ్లను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్.కె.పురం హౌసింగ్ లేఅవుట్ స్పెషల్ ఆఫీసర్, హౌసింగ్ ఏఈ, అన్ని సచివాలయాల మౌళిక వసతుల కల్పనా కార్యదర్శులు పాల్గొన్నారు.

మినీ మహానాడును విజయవంతం చేయాలి : ఎంపీ కలిశెట్టి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఈనెల 20న నిర్వహించే మినీమహానాడును విజయవంతం చేయాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మండలం చిలకపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్లో మినీ మహానాడు ఏర్పాట్లు, సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై శుక్రవారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ మహానాడు కార్య క్రమం నియోజకవర్గంలో ఆర్భాటంగా జరిగాలని, రాష్ట్రం మొత్తం మనవైపు చూసేలా నిర్వహించాలన్నారు. పెద్ద ఎత్తున నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనేలా చూడాలన్నారు. కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీలో సరైన గుర్తింపు ఉంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెదేపా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, డీసీఎంఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు బెందు మల్లేశ్వరరావు, ముప్పిడి సురేష్, లంక శ్యామ్, పార్టీ నేతలు పైడి ముఖలింగం, గూరు జగపతిబాబు పాల్గొన్నారు. తొలుత ఎంపీ ప్రజా దర్బార్ను నిర్వహించి వినత లను స్వీకరించి, అక్కడకక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి చొరవ చూపారు.

కూలిన సైఫాన్... పలు గ్రామాలకు రాకపోకలు బంద్

విశాలాంధ్ర-నందిగాం : మండలం ఆనందపురం గ్రామ సమీపంలో వంశధార ప్రధాన ఎడమ కాలువపై 1989లో సైఫాన్ (సూపర్పాస్) నిర్మించారు. తద్వారా కొండపై పడిన వర్షపు నీరు వంశధార ప్రధాన ఎడమ కాలువలోనికి వెళ్లకుండా గ్రామానికి చెందిన ఊరచెరువు లోపలికి వస్తోంది. ఆ సైఫాన్ నేటికి శిథిలావస్థకి చేరుకొని శుక్రవారం ఉదయం 10 గంటలకు కూలిపోయింది. ఆ వంతెనపై నుంచి బోరుబావులు తవ్వే లోడుతో ఓ లారీ వెళ్లింది. లా వంతెన దాటి వెళ్లిన తక్షణమే కూలిపోయింది. మరో దీంతో ఆయా గ్రామానికి, చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. సైఫాన్పై 2018 లో బీటీ రహదారి వేశారు. సైఫాన కూలిపోవడంతో రహదారి నిలువునా చీలిపోయింది. సైఫాన్ బలహీనంగా ఉందని సైఫాన్ నిర్మించిన తదుపరి బీటీ రహదారి వేయాలని గ్రామస్థులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న వంశధార శాఖ ఈఈ శేఖరరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం బొరివంక, మాణిక్యపురం విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్తు తీగలు, జంగిల్ క్లీరెన్స్ చేయు నిమిత్తం బొరివంక పీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు బోరివంక, బెజ్జిపుట్టుగ, మునిపుట్టుగ, బొగిడియాపుట్టుగ, దూగానపుట్టుగ గ్రామాలకు అలాగే మాణిక్యపురం పీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి సాయింత్రం 5 గంటల వరకు మాణిక్యపురం, బి. జి పుట్టుగ, వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస ఈఈ జి. యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులు, వ్యవసాయ రైతులు సహకరించాలని కోరారు.

టిడిపి కార్యకర్త లకు ఒక లెక్క.. మాకు ఒక లెక్కా?

- టిడిపి కుటుంబాలకు అదనంగా ఎకరాకు 12 లక్షల 50 రూపాయలు పోర్టు పరిహారం
- పరిహారం వ్యత్యాసంపై అడిగితే కేసు

-విలేకరుల సమావేశంలో స్థానిక సర్పంచ్, మూలపేట గ్రామస్తులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టుకు భూములు ఇచ్చిన రైతులకు పక్షపాతం చూపి టిడిపి కుటుంబాలకు ఒకరకంగా పరిహారం మిగిలిన రైతులకు మరో రకంగా పరిహారం ఇవ్వడం ఏమిటంటే మూలపేట సర్పంచ్ జీరు బాబురావు, గ్రామస్తులు నిలదీశారు. నౌపడ పోలీస్ స్టేషన్ ఎదురుగా శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడారు. మూలపేట పోర్టు కోసం మూలపేట, విష్ణు చక్రం చెందిన 464 కుటుంబాలు త్యాగం చేస్తే అప్పటి రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా ఎకరాకి 25 లక్షల రూపాయల పరిహారం అందించారు. అప్పుడు టిడిపికి చెందిన 23 కుటుంబాలు పరిహారం తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ 23 కుటుంబాలు ఎకరాకు 25 లక్షలు చెప్తున్నా పరిహారం తీసుకున్నారు. అయితే ఇప్పుడు ఎకరాకి అదనంగా మరోసారి టిడిపికి చెందిన 23 మంది కుటుంబాలకు ఎకరాకి 12 లక్షల 50 వేలు చొప్పున ఇచ్చి, మిగిలిన కుటుంబాలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పోర్ట్ పరిహారంలో ఇంత అన్యాయం, పక్షపాతం జరగడంతో అడిగినందుకు కేసులు నమోదు చేసి భయపడుతున్నారని అన్నారు. 1999 ఆలయ ధర్మకర్తలమని బోర్డు రాపించుకొని పోర్ట్ యాజమాన్యం వేసిన ఎనిమిది లక్షల 50 వేలు పరిహారం గ్రామానికి ఇవ్వకుండా వాళ్ళ అకౌంట్లో ఉంచుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో 6 ఆలయాలు నిర్మాణానికి రెండు కోట్ల 50 లక్షల రూపాయలు ఎస్టిమేషన్ వేశారని ఈ డబ్బుల ప్రజలకు చెందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ సమస్యలపై టెక్కలి సిఐ శ్రీనివాసరావు సమక్షంలో ఇరు వర్గాల మధ్య జరిగిన సమావేశంలో టిడిపి కార్యకర్త మంగి ఎర్రయ్య మూలపేట గ్రామాన్ని పోర్టుకు అమ్మేశావంటూ బండ బూతులు తిట్టారని, పోర్టుకు అమ్మేస్తే నువ్వు ఎలా ఉన్నావని ప్రశ్నించానని అన్నారు. అక్కడికి నాలుగు గంటలు సమయం అయినా తర్వాత నౌపడ పోలీస్ స్టేషన్కు వచ్చిన ఎర్రయ్య తమ్ముడు మంగి కేశవ ఎస్సై ఎదుట నువ్వు బయటికి వస్తే నీ అంత చూస్తాను అంటూ బెదిరించిన పోలీసులు ఏమి అనలేదని అన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా తీసుకోలేదని సర్పంచ్ బాబురావు వాపోయారు. టిడిపి కార్యకర్త నాపై ఇచ్చిన ఫిర్యాదు ఎలా తీసుకున్నారని అడిగిన సమాధానం పోలీసులు చెప్పలేదని అన్నారు. వివిధ మార్గాల ద్వారా గ్రామానికి వచ్చిన ఐదు కోట్ల రూపాయలు గ్రామస్తులు అందరికీ పంపిణీ చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. దీంతోపాటు గ్రామస్తులు జీరు శివ, జీరు రాంబాబు, మోహన్ రావు, అప్పల రెడ్డి, రోహిణి తదితరులు ఉన్నారు.

నవధాన్యాల సాగుతో నేల తల్లి సారవంతం

ఐటిడిఏ ఏపీ డి పైడి కూర్మారావు

విశాలాంధ్ర-మందస: గ్రామీణ ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయం ప్రగతికి రైతులందరూ తమ పొలాలలో ప్రస్తుతం నవ ధాన్యాలు సాగు తో నేల తల్లి సార్వంతంగా ఉంటుందని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శుక్రవారం మందస మండలంలో గల చీపీ పంచాయతీ సచివాలయం లో సర్పంచ్ ప్రతినిధి చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ రైతుల అవగాహన ర్యాలీ తదనంతరం నేలతల్లి ఆరోగ్యానికి నవధాన్యాల సాగు అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాన పంటతో పాటు ఈ నవధాన్యాల మొక్కలు పొలంలో పుట్టడం వల్ల పైరుకు మేలు చేసే సూక్ష్మజీవులు వాటి వేళ్ళ ద్వారా నేల గుళ్ళ బారి వాన పాములు లాంటి మిత్ర పురుగులు అభివృద్ధి చెందుతాయని వివరించారు. కుళ్ళిన పేడ ,పశువుల ఎరువు, పెంట గత్తం, ఉపయో గిస్తూ ,యూరియా లాంటి రసాయ నాలను బాగా తగ్గిం చాలని రైతులకు సూచిం చారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతు లను అవలంబి స్తున్న నలుగురు రైతులను గుర్తించి సర్పంచ్ గారి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెంకట్రావు, నరేష్, ఈశ్వరరావు,వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంసిఆర్ పి. సవర బాలక్రిష్ణ, ఐసిఆర్పి లు గంగమ్మ,సుహాసిని, లక్ష్మీనారాయణ, దీనబంధు,ప్రసాద్ సచివాలయం సిబ్బంది తో పాటు ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

- అవగాహనతోనే నివారణ సాధ్యం
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: డెంగ్యూ వ్యాధి పై అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డిఎంహెచ్ఓ కార్యాలయం నుండి 7 రోడ్డు జంక్షన్ వరకు నిర్వహించే ర్యాలీని డిఎంహెచ్ఓ డాక్టర్ అనిత జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 సంవత్సరం నుండి డెంగ్యూ కేసులలో హెచ్చు తగ్గులు ఉన్నప్పటికీ ఇంతవరకు జిల్లాలో డెంగ్యూ నిర్ధారిత మరణాలు నమోదు కాలేదన్నారు. 2021లో 117 కేసులు, 2022లో 89 కేసులు, 2023లో 54 కేసులు, 2024లో 67 కేసులు, 2025 లో ఇంతవరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి డెంగ్యూకు సంబందించి నిర్ధారణ (ఎలీషా) పరీక్షల కోసం పంపిన రక్త సీరం నమూనాలు జిల్లా ఆసుపత్రి శ్రీకాకుళంలో, జిల్లా ఆసుపత్రి, టెక్కలిలో మాత్రమే నిర్ధారణ చేస్తారని వివరించారు. డెంగ్యూ అనే వ్యాధి ఏడిస్ అనే దోమ కాటు వలన వ్యాప్తి చెందుతుందని తెలిపారు. డెంగ్యూ వైరస్ వల్ల వచ్చే దోమకాటు వ్యాధి కాబట్టి రాకుండా నివారణ చర్యలు పాటిద్దామని పిలుపునిచ్చారు. దోమలపై దండయాత్ర చేసి నివారణకు తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతీ ఒక్కరూ విధిగా డ్రై డే ను పాటించాలని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం డిఎంహెచ్ఓ కార్యాలయం నుండి ఏడు రోడ్ల కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అందరితో డెంగ్యూ నివారణ పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత, జిల్లా మలేరియా అధికారి పి.వి. సత్యనారాయణ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, పబ్లిక్ హెల్త్ డాక్టర్ సుధీర్, రెడ్ క్రాస్ సొసైటీ నుండి చైతన్య, సత్యనారాయణ, వాకర్స్ ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కమిటీ కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: అక్కుపల్లి శ్రీ రామా సేవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ అభయాంజనేయ అభివృద్ధి కమిటీ కార్యవర్గంను సభ్యులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులు గా కె ఎల్ నాయుడు, ఉపాధ్యక్షులు కాస వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి కాస ముకుందరావు ,ఉప కార్యదర్శి బర్రి భూపతి, కోశాధికారి కాస సోమ శేఖర్ , కార్యనిర్వహణ సభ్యులుగా కాస ఈశ్వరరావు , సింగుపల్లి బాల క్రిష్ణ , గండుపల్లి మహేష్ , మద్దు వాసు, లండ మురళీ, అర్జాల జేజేరావు, మద్దు లక్ష్మణరావు, సింగుపల్లి జగన్నాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి శ్రీ రామా సేవా సంఘం అధ్యక్షులు మోస వరప్రసాద రావు, ప్రధాన కార్యదర్శి అర్జాల ఈశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాస చలపతి రావు, మద్దు మురళీ, మోస కుమార్, సూరాడ లోకనాదం, మద్దు మాలయ్య, పిన్నాసి శ్రీకాంత్,జామి అనిల్‌కుమార్ పాల్గొన్నారు

ప్రజా ఫిర్యాదులను పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

ఎస్పీ మహేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-పలాస: ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వచ్చిన ప్రజా ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేధిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజలు ఇచ్చిన పిర్యాదులను విని సానుకూలంగా స్పందించి, వారి సమస్యలపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. తక్షణమే ఆయా ఫిర్యాదులను గూర్చి సంబంధిత పోలీస్ అధికారులకు చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం అందించాలని ఆదేశించారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఆవరణంలో ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సివిల్, కుటుంబ కలహాలు, ఆస్తి , కొట్లాట,మిస్సింగ్, ఇతరత్రా అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఆయా పిర్యాదులు పై తీసుకున్న చర్యలు ను నివేదిక రూపంలో నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేయాలని జిల్లా ఎస్ పి మహేశ్వర రెడ్డి సూచించారు.

పుణ్యక్షేత్రం శ్రీముఖలింగానికి శనివారం కలెక్టర్ రాక

ఎంపీడీఓ అప్పలనాయుడు

విశాలాంధ్ర-జలుమూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం జలుమూరు మండలం శ్రీముఖలింగాన్ని శనివారం జిల్లా కలెక్టర్ సందర్శిస్తారని ఎంపీడీవో కే అప్పలనాయుడు తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర భాగంలో కలెక్టర్ విచ్చేస్తున్నారని గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు ఇతర కార్యక్రమాలపై స్వయంగా పరిశీలిస్తారని ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు అందరు పాల్గొవాలని కోరారు.

సాగునీరు కాలువల పనితీరుపై ప్రత్యక్ష సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-జలుమూరు: మండల పరిధిలో వ్యవసాయానికి సాగునీరు అందించే వివిధ పిల్ల ప్రధాన కాలువల పనితీరుపై శుక్రవారం జలుమూరు మండల సర్వసభ్య సమావేశం మందిరంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో కే అప్పలనాయుడు మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారులు అందరూ పూర్తి సమాచారం అందించాలని సూచించారు. మరి కొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ వస్తుందందున రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందేందుకు వీటిని తక్షణమే మరమ్మతు చేపట్టాలని ఇక్కడున్న సమస్యలను నివేదిక తయారుచేసి జిల్లా అధికార యంత్రాంగానికి తీసుకు వెళ్ళవలసి ఉందన్నారు కనుక ఖచ్చితమైన సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి కే సురేష్, పంచాయతీ విస్తరణ అధికారి పి ఉమామహేశ్వరరావు, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఎన్ ఆర్ జి ఎస్ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు పలువురు పాల్గొన్నారు.

సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలి

విశాలాంధ్ర-మందస: మండలం లో సాగునీటి చెరువులు కాలువలు ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని, గ్రామాల్లో ఉన్న చెరువులు కాలువలు పై సర్వే చేయాలని ఎంపీడీవో వెంకటరమణ ఉపాధి హామీ పథకం ఏపీ డి శ్రీనివాసరెడ్డి కోరారు. శుక్రవారం మందస మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నీటి సంఘాల కార్యవర్గ సభ్యులతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం జరిగింది ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నీటి వనరుల సర్వే జరగాలని ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు సమావేశంలో స్థానిక ఉపాధి హామీ పథకం ఏపీవో హరికృష్ణ ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు వ్యవసాయ శాఖ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మందస తహసిల్దార్ గా మిస్కా శ్రీకాంత్..?

విశాలాంధ్ర-మందస: మందస తహసిల్దార్ గా మిస్కా శ్రీకాంత్ నియమితమైనట్లు తెలుస్తోంది. గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం. ఈయన జలుమూరు మండల తహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్నారు.

వేసవి ఎండల దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ నడిపెన రామారావు

విశాలాంధ్ర-పలాస: వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవు తున్న నేపథ్యంలో పలాస కాశీబుగ్గ జంట పట్టణాల ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు సూచించారు. శనివారం బస్టాండ్ ఆవరణలో చలివేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలో డిహైడ్రేషన్ కాకుండా ఉండేందుకు ద్రవ పదార్థాలు మరియు మంచినీటిని ఎక్కువగా తీసుకోవాలన్నారు. పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకోవాల్సింది గా సూచించారు. ఉదయం 10 గంటల లోపు సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే బయటికి రావాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చేటప్పుడు గొడుగు, టోపీ రక్షణగా వాడాలన్నారు. ప్రధాన కూడళ్ళల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ముందు జాగ్రత్తలను ప్రచారం చేసి ప్రజలను అప్రమత్తం చేసేందుకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం నాడు 'బీట్ ద హీట్' పై స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహణకు ఏర్పాటుచేస్తుందని, అందుకు ప్రజలందరూ సహకరిం చాలని కోరారు. మొక్కలను విరివిగా నాటి ఉష్ణతాపాన్ని తగ్గించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

రాంబాబు చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ జెడ్పిటిసి బగ్గు సుగుణమ్మ.

విశాలాంధ్ర-పోలాకి: ఇటీవల అనారోగ్యంతో మరణించిన యూనిట్ ఇన్చార్జి జిల్లా రైతు కమిటీ కార్యదర్శి మాజీ సర్పంచ్ ప్రతినిధి లుకలాపు రాంబాబు చిత్రపటానికి బుధవారం మాజీ జెడ్పిటిసి సభ్యురాలు బగ్గు సుగుణమ్మ నివాళు లర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కూటమి పార్టీ నాయకులు ఎం వెంకటప్పలనాయుడు కిల్లి వేణు తెంబూరు చినబాబు అన్నాజీరావు చిన్నప్పన్న మాస్టర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

శక్తి యాప్ పై విద్యార్థులకు అవగాహన

మొబైల్ ఫోన్లో తప్పనిసరిగా శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి

విశాలాంధ్ర-టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్ పై మహిళలు, విద్యార్థినులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని శక్తి బృందం ఎస్సై రవి అన్నారు. మండలంలోని ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శక్తి యాప్ పై విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ యాప్ ద్వారా ఆపదలో ఉన్న విద్యార్థులు మహిళలు యువతులు పోలీసుల సహాయం పొంది ఆపదనుండి బయటపడవచ్చు అని ఆయన సూచించారు. చుట్టుపక్కల వారికి కూడా తెలియజేసి వారిని కూడా అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. యాప్ ను వినియోగించి ఎప్పుడు సహాయం కావాలన్నా సహాయముతో సంబంధం లేకుండా సహాయం అందుతుందని ఆయన అన్నారు. అనంతరం కళాశాలలో ఉన్న విద్యార్థులు మొబైల్ ఫోన్లో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేయించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శక్తి పోలీస్ సిబ్బంది, ఐతమ్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ గురుకులాల్లో మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించాలి

- డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకులాలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం - చక్కదిద్దవాల్సింది కూటమి ప్రభుత్వమే.
- నందిగాం బాలికల గురుకుల పాఠశాలను అభివృద్ధికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పూనుకోవాలి
- రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న బోధన బోధనేతర సిబ్బంది నియామకాలను నోటిఫికేషన్ ద్వారా తక్షణమే భర్తీ చేయాలి
- శిథిలావస్థకు చేరిన భవనాలు మరమ్మతులు చేయించాలి, భవనాలు కొరత ఉన్న చోట నూతన భవనాలు నిర్మాణాలు చేయాలి
- సౌకర్యాలు లేక ప్రతి సంవత్సరం విద్యార్థులు సంఖ్య తగ్గుతున్నదని సౌకర్యాలు మెరుగుకై ప్రభుత్వం చొరవ చూపాలి

విశాలాంధ్ర-టెక్కలి: అంబేద్కర్ గురుకులాల్లో మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించాలని దళిత సంఘ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక అరుణ విద్యాలయంలో దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకులాల్లో మెరుగైన విద్యా సౌకర్యాల కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో దళిత విద్యార్థుల విద్యా పట్ల గత ప్రభుత్వం చాలా నిర్లక్ష్యం చేసిందని, పూర్తిగా విద్యావ్యవస్థ ను ధ్వంసం చేసిందని అందుకే వైఎస్ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని,గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో గురుకులాల్లో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం భర్తీ గాని ఒక్క గురుకుల విద్యాలయం స్థాపించడం గానీ జరగలేదని చివరకి విద్యార్థులకు ఇస్తున్న కాస్మోటిక్స్ ఛార్జీలు ఇవ్వకుండా రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం దళిత విద్యార్థులు విద్యా పట్ల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి కుంటుపడిందని దానికి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చక్కదిద్దాలని వారు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకులాల్లో పారామెడికల్ కోర్సులు ప్రవేశ పెట్టాలనీ, జిల్లా కు రెండు బాలుర, రెండు బాలికల డిగ్రీ కాలేజీలు స్థాపించాలనీ, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కాస్మోటిక్స్ ఛార్జీలు ఇవ్వాలని తెలిపారు. గురుకులాల్లో రోజు రోజుకు విద్యార్థుల సౌకర్యాలు కొరవడుతున్నాయని అందువల్లే విద్యార్థులు గురుకుల విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే శిథిలావస్థకు చేరుకున్న భవనాలు మరమత్తులు చేయించాలి, కొత్త భవనాలు నిర్మించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెంటైనెన్స్ లేకపోవడం వలన మినరల్ వాటర్ ప్లాంట్ లు గురుకులాల్లో ఉత్సవ విగ్రహాల ఉన్నాయని, రూరల్ ప్రాంతాల్లో కొండ ప్రాంతంలో ఉన్నా గురుకులాల్లో జెనేటర్ లేకపోవడం వలన చాలా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి సోలార్ పవర్ సరఫరా చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యర్ల గోపీ, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, సామాజిక సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్,సమత సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య , అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు రాకోటి రాంబాబు కార్యక్రమంలో పాల్గొనవారు దళిత జెఏసి నాయకులు మట్ట పురుషోత్తం ,జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు మురళీధర్,దాలయ్య యుటిఎఫ్ నాయకులు,జె బాబూరావు, పిఆర్టియు రాష్ట్ర నాయకులు, తెంబూరు నరసింహమూర్తి దళిత జెఎసి నాయకులు, ఉదయపు శ్రీనివాసరావు ఏపీటీఎఫ్ నాయకులు, పాలవలస ధర్మారావు యుటిఎఫ్ నాయకులు కొమ్మల దమయంతి జననాట్య మండలి రాష్ట్ర కన్వీనర్ బొకర గోపీ టీచర్ తలసముద్రం సూర్యం నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ బంగారు తాతారావు బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు అట్లా రాహుల్ కుమార్ దళిత జెఏసి నాయకులు, జొన్న సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

కొనసాగుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ నిరవధిక సమ్మె

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారి సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మె బాట పట్టారు. రెండవరోజు శ్రీకాకుళం నగరపాల సంస్థ కార్యాలయం వద్ద ఉదయం నుండి విధులు బహిష్కరించి మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ కార్యాలయ సిబ్బంది వాల్ ఆపరేటర్స్ పంప్ ఆపరేటర్స్ పూర్తిస్థాయి సమ్మెకు సన్నద్ధమయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ ఇంజనీరింగ్ కార్మికుల గౌరవాధ్యక్షుడు టి. తిరుపతిరావు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వై.శ్యామలరావు , ఆర్.సతీష్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు టెక్నికల్, నాన్ టెక్నికల్ గా పెంచి ఇవ్వాలని , సీనియారిటీ ప్రకారం ప్రమోషన్ ఇవ్వాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలన్నారు. రిటర్మెంట్ వయసు 60 నుండి 62 కు పెంచాలని, నగర జనాభా అనుగుణంగా ఇంజనీరింగ్ కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించ కుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు ఉధృతం చేస్తామన్నారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తం గా యూనియన్ నాయకులతో చర్చలు జరిపి మా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కళ్యాణి. అప్పలరాజు, సహాజక్షులు జె. గురుమూర్తి పాల్గొన్నారు. శానిటరీ మెస్త్రీల సంఘం నుంచి ముద్దాడ రామారావు ,షణ్ముఖ రావు పాల్గొని మద్దతు తెలియజేశారు మున్సిపల్ ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు సుంగాలి శంకరరావు, మణి, ఆది, ముకేష్ యాదవ్, మజ్జి శ్రీను, దేవి, జయశ్రీ, రాజేశ్వరి, రాఘవ, చిన్న రాము, శశి తదితరులు పాల్గొన్నారు.

3 కోట్ల నిధులతో పలు గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర-పోలాకి: మండలంలో గంగివలన పంచాయితీ లో కస్తూరిబాయ్ కళాశాలలో 255.50. లక్షల నిధులతో అదనపు తరగతి గదులు శుక్రవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. అనంతరం కళాశాల యాజమాన్యాన్ని విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుప్పిడి పేట హాస్పిటల్ అవర్ణలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ కేంద్రం ప్రారంభించి హాస్పటల్ పరిసరాలను పర్యవేక్షణ సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రొనంకి కృష్ణం నాయుడు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మాజీ ఏఎంసి చైర్మన్ బైరి భాస్కర్ రావు, సీనియర్ నాయకులు సూరపు నారాయణ దాసు, డోల ప్రసాద్, పప్పల ధర్మరావు, నందుపిల్లి దండాసి, జోగారావు, లబ్బ ధనలక్ష్మి, సర్పంచ్ అజ్జాల విష్ణు, ముఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఏజెన్సీ లో తిరంగా యాత్ర..

విశాలాంధ్ర-రంపచోడవరం : మండల కేంద్రం లో ఈ రోజు తిరంగా జెండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ ఎస్ టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన జవాను ల త్యాగాలను కొనియాడారు. ముందుగా కోదండ రామాలయం నుండి ప్రారంభమైన యాత్ర మెయిన్ రోడ్డు మీదుగా వాల్మీకి విగ్రహం వరకు తిరిగి మరల రామాలయం వరకు తిరంగా యాత్ర జరిగింది. కుల మత రాజకీయ లకు అతీతంగా అందరు ఈ తిరంగ ర్యాలీ లో పాల్గొని మన సైనికులకు నూతన ఉత్సాహం కల్పిస్తూ తమ దేశభక్తిని చాటుకొన్నారు. ఈ కార్యక్రమం లో హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు వెంకట రామారెడ్డి , గుప్తా , కిషోర్ మసీద్ ప్రెసిడెంట్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్లో చింతాడపై నరసన్నపేట విజయం

విశాలాంధ్ర-ఆమదాల వలస: ఆమదాల వలస కళాశాల మైదానంలో జరుగుతున్న ఎమ్మెల్యే కప్ టి20 క్రికెట్ టోర్నమెంట్లో సెమీ ఫైనల్ లో చింతాడ జట్టుపై మూడు వికెట్ల తేడాతో నరసన్నపేట జట్టు విజయం సాధించింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచు కున్న చింతా డ జట్టు 16 ఓవర్లలో 96 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యారు. తరువాత బ్యాటింగ్ దిగిన నరసన్నపేట జట్టు 9 ఓవర్లలోనే టార్గెట్ చేదించి విజయం సాధిం చారు. ఈనెల 22వ తేదీన ఫైనల్ మ్యాచ్ ఆముదాలవలస కళాశాల మైదానంలో నిర్వహించబడును. సీఎం సీసీ ప్రతినిధి తమ్మినేని విద్యాసాగర్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ క్రికెట్ పోటీలు సెమీ ఫైనల్ దశకు చేరుకున్నాయి. మొదటిసారిగా సెమీఫైనల్ కు నరసన్నపేట జట్టు చేరువైంది. మ్యాచ్ కి ముఖ్యఅతిథిగా శివాని ఇంజనీరింగ్ కాలేజీ కరెస్పాం డంట్ సనపల రాజా హాజరై విజేతలను అభినం దించారు. టోర్నమెంట్ నిర్వాహకులు విద్యాసాగర్ మరియు లోకల్ బాయ్స్ పాల్గొన్నారు. అలాగే ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఈనెల 22న జరుగుతుందని నిర్వహణలో తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ...

ఒకరికి గాయాలు

విశాలాంధ్ర-నందిగాం: మండలం కవిటిఅగ్రహారం సమీపంలో పూండి నుంచి వస్తున్న ద్విచక్ర వాహనానికి బెండిగేటు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో తులసీరావు అనే వ్యక్తి గాయపడ్డారు. గాయపడిన తులసీరావును పూండిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దీనిపై పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు.

పాత నేరస్థులపై నిఘా ఉంచాలి

- గస్తీ విధులు పటిష్టం చేయాలి
- ప్రతి రోజు గ్రామాలు సందర్శించాలి
- జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి
- టెక్కలి అర్బన్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-టెక్కలి: రాత్రి వేళలో గస్తీ విధులు పటిష్టం చేసి నేర నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి సూచించారు. శుక్రవారం టెక్కలి పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో ముందుగా స్టేషన్ రిసెప్షన్ కేంద్రంలో రికార్డుల నిర్వహణ ప్రజా సమస్యలు పరిష్కార తదితర అంశాలను పరిశీలించి మహిళ సమస్యలకు ప్రాధాన్యత, ఇస్తూ పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి,వాటి దర్యాప్తు, పురోగతిపై ఆరా తీసారు. రౌడీ షీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తులపై, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. దొంగతనాలు మరియు ఇతర నేరాలను అరికట్టేందుకు రాత్రి గస్తీ విధులు లను మరింత పటిష్టంగా నిర్వహించాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న ఎన్.బి.డబ్ల్యు ను త్వరగా అమలుపరచాలన్నారు. సమస్యాత్మక గ్రామాల పై దృష్టిసారించి గ్రామస్తులతో మమేకమై ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు, గ్రామ సందర్శన,దత్తత కానిస్టేబుల్, మహిళా పోలీసుల సమన్వయంతో కట్టడి చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ఎంవి చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి ట్రాఫిక్ నిబంధనలపై. రోడ్డు ప్రమాదం నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిరంతరం నిర్వహించాలని పలు అంశాలు పై జిల్లా ఎస్పీ సీఐ విజయ కుమార్ కు సూచనలు తెలియజేశారు. ఈ తనిఖీలలో అర్బన్ సీఐ అంబటి విజయ్ కుమార్, స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం ద్వంద వైఖరి

విశాలాంధ్ర-కవిటి: ప్రభుత్వం మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో సెకండరీ గ్రేడు ఉపాధ్యాయుల నియామకంలో ప్రభుత్వం ద్వంద వైఖరి ప్రదర్శిస్తుందని కవిటి మండల శాఖ ఉపాధ్యాయ అధ్యక్ష,కార్యదర్శులు బల్ల ధర్మారావు, గుడియా వంశీలు అన్నారు. ఈ మేరకు శుక్రవారం దీనికి సంబంధించి పత్రిక ప్రకటన విడుదల చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్లో 45 మంది విద్యార్థులు కన్న ఎక్కువ ఉండి, మూడు తరగతి గదులు ఉంటే ఒక ప్రైమరీ ప్రధానోపాధ్యాయులు మరియు నలుగురు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను మంజూరు చేస్తున్న తరుణంలో ఒరియా ఆంగ్ల మాధ్యమాల్లో బైలింగ్వల్గా నడుస్తున్న పాఠశాలల్లో మాత్రం ఆంగ్ల మధ్యమంలో మరియు ఒరియా మధ్యమంలో ఉన్న మొత్తం విద్యార్థులను ఒకే కేటగిరీ కింద తీసుకొని ఆంగ్ల మాధ్యమంలో పందకు పైగా ఉన్న ఒరియా మాధ్యమంలో పందకు పైగా ఉన్న రెండు సెక్షన్లకు ఆయా మాధ్యమాల్లో విద్యార్థులను బట్టి కందరీ గ్రేడ్ పోస్టులు బేసిక్ ప్రైమరీలా కేటాయించడం సరికాదని అన్నారు. అందరికీ సమన్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిదులు మొర్రి గోపి, సమల్ల రాజబాబు, కె.రంగారావులు పాల్గొన్నారు.

జాడుపూడి స్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి

- జెడ్ఆర్యుసిసి సభ్యులు శ్రీనివాస రౌతో

విశాలాంధ్ర-కవిటి : ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని జాడుపూడి,బారువ రైల్వేస్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని ఖుర్దా రోడ్డులోని డీఆర్ఎం. కార్యాలయంలో డీసీఎంకు జెడ్ఆర్యుసిసి సభ్యులు శ్రీనివాస రౌతో, డిఆర్యుసిసి సభ్యులు కె. సూర్యప్రకాష్ లు వినతి పత్రం అందజేశారు. అలాగే కొత్తగా మంజూరైన 12 రోడ్డు ఓవర్ బ్రిడ్జీలు, 2 రోడ్డు అండర్ బ్రిడ్జీల పనులు త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. డీసీఎం దీని సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

కాలువలపై ప్రత్యేక సమావేశం

విశాలాంధ్ర - జలుమూరు: సారవకోట మండల పరిధిలోగల వ్యవసాయ భూములకు సాగునీరు అందించే పిల్ల కాలువల మరమతులను గుర్తించాలని సారవకోట మండల అభివృద్ధి అధికారి వి మురళీమోహన్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశంలో జరిగే ప్రత్యేక సమావేశానికి పాల్గొని మాట్లాడారు. ప్రతి పంచాయతీ గ్రామ సచివాలయ పరిధిలో ఇటువంటి కాలువలను గుర్తించాలని దాని ద్వారా వ్యవసాయానికి సాగునీరు అందించాలని, ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగం లక్ష్యమని అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి ఎం లోకనాథం, తాసిల్దార్, పంచాయతీ విస్తరణ అధికారి ప్రభాకర్ రావు, పలు శాఖ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'దివ్య'కు దూరదర్శన్‌లో అవకాశం



విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : స్థానిక శ్రీ స్వేచ్ఛా నృత్య తరంగిణి కూచిపూడి భరతనాట్యం జానపద నాట్య శిక్షణాలయం నాట్య గురువు మంగి దివ్య కు దూరదర్శన్ బి హై గ్రేడింగ్ పోటీలకు అవకాశం లభించింది. 2023లో దూరదర్శన్ బి గ్రేడింగ్ పోటీల్లో పాల్గొని బి గ్రేడింగ్ ఆర్టిస్ట్‌గా ఆమె స్థానం సంపాదించుకుంది. 2024కు గాను దూరదర్శన్ యాదగిరి ఛానల్ బి హై గ్రేడింగ్ ఆడిషన్స్‌కు ధరఖాస్తు చేసుకోగా మే 16న దూరదర్శన్ ప్రోగ్రాం డైరెక్టర్ వాట్సాప్ ద్వారా వర్తమానం అందించారని దివ్య తెలిపారు. మొత్తం 14 నిమిషాల నాట్య ప్రదర్శనకు అవకాశం ఉండే పోటీల్లో గెలుపొంది దూరదర్శన్ బి హై గ్రేడ్ ఆర్టిస్ట్‌గా విజయం సాధించాలని నాట్య శిక్షణాలయం అధ్యక్షులు కె. గోవింద్, దాలమ్మ తదితరులు ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ముకుందరావు సంఘటనా స్థలాన్ని సందర్శించి క్షతగాత్రుని ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎస్.ఐ తెలిపిన వివరాల మేరకు కంచిలి గ్రామానికి చెందిన సుశాంత్ ప్రధాన్(45) బరంపురంలో బట్టలు కొనుక్కోడానికి బైక్ పై వెళ్తుండగా మార్గమధ్యంలో జాతీయ రహదారిపై బెల్లుపడ పాత టోల్ ప్లాజా దగ్గరకు చేరే సరికి రోడ్డు పక్కన ఉన్న సేఫ్టీ రాడ్లకు బైక్ ఢీకొనడంతో ఎగిరి పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రున్ని హైవే అంబులెన్సులో ఇచ్ఛాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి మెరుగైన చికిత్స నిమిత్తం బరంపురం తరలించారు. క్షతగాత్రుని భార్య భవాని ప్రధాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసారు.